

నేడు నగర పాలక సంస్థలో 'స్పందన'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరవాసుల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక ఆవరణలో సోమవారం (14.11.2022) ఉదయం 10.30 నుంచి స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారు మాస్కులు ధరించి, కోవిడ్-19 నిబంధనలను పాటించాలని కోరారు. స్పందన కార్యక్రమానికి నగరపాలక శాఖాధిపతులు హాజరుకావాలన్నారు. వార్డు సచివాలయల్లోనూ సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య స్పందన కార్యక్రమం జరుగుతుందని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితో పాటుగా నగరపాలక సంస్థ కాల్ సెంటర్ నెంబర్ 08572- 232745, వాట్సప్ నంబర్ 98499 07885 ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు.

చలిపులి..!

- తగ్గిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఉన్ని వస్త్రాలకు పెరుగుతున్న డిమాండు
- భారీగా అమ్మకాలు

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

జిల్లాలో చలి గడగడలాడిస్తోంది. ఉష్ణోగ్రతలు తగ్గిపోతున్నాయి. దీంతో వాతావరణం చల్లబడి చలిపుట్టిస్తోంది. దీంతో ఉన్ని వస్త్రాలకు బాగా డిమాండు పెరుగుతోంది. అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఆఫర్లతో అంగడి వారు ఆకర్షిస్తున్నారు.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు

జిల్లాలో ముసురు వానకుతోడు చలిగాలులతో జనం తల్లడిల్లుతున్నారు. ఉదయం ఏడు గంటలకు కూడా సూర్యుని వెలుగు రావడం లేదు. దీంతో జనం బయటకు రావడానికే బెంబేలెత్తిపోతున్నారు. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు 24 నుంచి 26 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. దీంతో పగటి పూట కూడా చలిచలిగా ఉంటోంది. ఉదయం వేళ అయితే 15 డిగ్రీలకు మించి పెరగడం లేదు. దీంతో ఉదయాన్నే లేచి పనులకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాలు అమ్మేవాళ్లు, పేపర్ వేసే వాళ్లు ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్ని వస్త్రాలకు డిమాండు

చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉన్ని వస్త్రాలకు డిమాండు పెరుగుతోంది. బతుకు తెరువు కోసం మధ్యప్రదేశ్ నుంచి వచ్చే వారు స్టాళ్లు పెడుతున్నారు. చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం, పుంగనూరు వంటి ప్రాంతాల్లో దుకాణాలు పెడుతున్నారు. అలాగే దకాణాల్లో వీటి అమ్మకాలు పెరుగుతున్నాయి. రాజస్థాన్, షోలాపూర్ నుంచి ఎక్కువ మంది తెచ్చి అమ్ముతున్నారు. మూడు నెలల పాటు సాగే ఈ వ్యాపారంలో ఎక్కువ మందికి ఉపాధి దొరుకుతోంది. వీరు జనవరి వరకు వ్యాపారం సాగించి తిరిగీ వెళ్లిపోతుంటారు. షోలాపూర్ దుప్పటి రూ.250 నుంచి రూ.300 వరకు సైజును బట్టి రూ.500 వరకు కూడా అమ్ముతున్నారు. ఇక స్వెటర్లు జత రూ.500 నుంచి రకాన్ని బట్టి అమ్ముడుపోతోంది. మహిళలు ఉపయోగించే రూ.200 నుంచి రూ.500 వరకు అమ్ముతున్నారు. ఇక మంకీక్యాప్‌లు, జర్కిన్‌లు కూడా అమ్ముడుపోతున్నాయి.



చిత్తూరులో ముసురు వానలు

అధ్వానంగా అంతర్రాష్ట్ర రోడ్లు

- స్పందించని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి- యాదమరి: చిత్తూరు గుడియాత్తం జాతీయ అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా తయారైంది. యాదమరి మండలం జోడిచింతల పోలీసుస్టేషన్ నుంచి తమిళనాడు సరిహద్దు కనికాపురం చెక్‌పోస్ట్ వరకు ఎక్కడ చూసినా గుంతలే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దారులు... పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారిగుండా ప్రయాణికులు ప్రయాణించాలంటే నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు.

గత ఏడాది కురిసిన వర్షాలకు తారురోడ్డు పూర్తిగా దెబ్బతిని మరమ్మతులు నోచుకోకపోవడంతో రోడ్లలో అడుక్కోగుంత ఏర్పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ గుంతలు బావులను తలపిస్తున్నాయి. తరచూ వాహనచోదకులు ప్రమాదాల భారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని సర్వసభ్య సమావేశంలో సైతం సర్పంచులు అధికారులు దష్టికి తీసుకెళ్లారు. అయితే ఏమాత్రం ప్రయోజనం లేదు. చిత్తూరు గుడియాత్తం జాతీయ రహదారి తొమ్మిది కిలోమీటర్ల దూరం ఉంది.

ఈ మార్గంలో అడుగడుగునా భారీగుంతల దర్శనమిస్తున్నాయి. వాహనదారులు వాటిని తప్పించి ప్రయాణం సాగించడం దుర్లభంగా మారుతుంది ఈ రహదారుల్లో కొన్ని ప్రాంతాల్లో వర్షానికి భారీఎత్తున గోతులు ఏర్పడ్డాయి. కురుస్తున్న వర్షాలు గోతుల్లో నీళ్లు నిలవడం ద్వారా ప్రమాదాలకు నిలయంగా మారాయి. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్న సంఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. కొంతమంది గాయాలపాలై మతిచెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ రోడ్లలో ప్రతిరోజు ప్రయాణించాలంటే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది.

యాదమరి మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు లైన కొట్టాలం వెళ్లే రహదారి, మంగదానపల్లి నుంచి కష్ణంపల్లికి వెళ్లే రహదారి, మదిరెడ్డిపల్లి రహదారి, భూమిరెడ్డిపల్లికి వెళ్లే రహదారి, కొత్తూరు ఏఏడబ్ల్యు, దసరాపల్లి ఎస్టీకాలనీకి వెళ్లే రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. వర్షపు నీటికి రోడ్లు కోసుకుపోయి వాగులను తలపిస్తున్నాయి. మరికొన్ని దారులు గుంతలు తెలియ చెరువుల మారిపోయాయి. ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. కనీసం ద్విచక్రవాహనాలు సైతం నడపలేని పరిస్థితి, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, దారుల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా స్పందించి రోడ్లు మరమ్మతులు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



చిత్తూరు గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిలో భారీ గోతులు



గ్రామీణ రహదారులు కృష్ణంపల్లికి వెళ్లే దారులు బురదమయం

నాసిరకం రోడ్లతో ఇక్కట్లు

- తూతూమంత్రంగా మరమ్మతులు
- మూన్నాళ్ల ముచ్చటగా తాళ్లపల్లి రోడ్డు నిర్మాణం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

గంగవరం: నాసిరకం రోడ్లతో కాంట్రాక్టర్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు అనడానికి గంగవరం మండలం తాళ్లపల్లి గ్రామం వద్ద ఇటీవల చేపట్టిన రోడ్డు నిర్మాణం. దీనిపై జాతీయ మానవ హక్కులు-అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డీవీ మునిరత్నం, సహాయ కార్యదర్శి వేలాయుధం మాట్లాడుతూ తాళ్లపల్లి గ్రామానికి తూర్పు, పడమర వైపు వేసిన తారురోడ్డు కంకర తేలి విపరీతమైన గుంతలు పడటంతో ఆ రోడ్డు వైపున వెళ్లాలంటే ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రాణాలు అరచేతులో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. అనుభవం లేని వ్యక్తికి రోడ్డు నిర్మాణం పనుల కాంట్రాక్ట్ ఇవ్వడంతో నాసిరకంగా పనుల జరిగాయి. దీంతో రెండు నెలలు పూర్తి కాకముందే కంకరతేలి రోడ్డు వర్షానికి జలమయమైంది. గతంలో గుంతలు రోడ్డుతో పలువురు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతను పరిశీలించాల్సిన అధికారులు అటువైపు వెళ్లకపోవడంతో కాంట్రాక్టర్లు విచ్చలవిడిగా రోడ్డు పనులు చేపడుతున్నారు. దీంతో రోడ్డు మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. తాళ్లపల్లి గ్రామం వద్ద రోడ్డు సక్రమంగా లేనందున ఆర్టీసీ బస్సులు, ఆటోలు కొద్దిరోజులపాటు తిరగకుండా ఆగిపోయాయి. దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటలు

బిందు సేద్యానికి ప్రాధాన్యత

జిల్లా ఉద్యానవన అధికారి మధుసూధన్‌రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

రాష్ట్ర ప్రభుత్వం బిందుసేద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని జిల్లా ఉద్యానవన అధికారి మధుసూధన్‌రెడ్డి తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఈ మేరకు ఆసక్తి చూపే ప్రతిరైతుకు రాయితీపై బిందుసేద్యం పరకరాలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో 14వేల హెక్టార్లలో బిందు సేద్యం కోసం దరఖాస్తులు వచ్చాయని వీటిని పరిశీలిస్తున్నామని తెలిపారు. ఇంకా అవసరైన రైతులు బిందుసేద్యం పరికరాలను అమర్చుకొనేందుకు రైతుభరోసా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చు అన్నారు. తక్కువనీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండించాలని బిందు సేద్యంకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జిల్లాలో 14వేల హెక్టార్లకు దరఖాస్తులు రావడం జరిగిందని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇంకా కావాల్సిన అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు క్షేత్రస్థాయి పరిశీలన రైతుభరోసా కేంద్రాలలోని సిబ్బంది ద్వారా జరుగుతుందన్నారు. నెల రోజులలోపు పరికరాలు అందజేయబడతాయని తెలిపారు. జిల్లా అమలు చేస్తున్న బిందు సేద్యంపై ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో ఉద్యాన వనశాఖ కార్యక్రమాలను తెలియజేశారు.



ఇంటర్వ్యూ

ప్రజాశక్తి: డ్రిప్ పరికరాలు సబ్సిడీపై అందించేందుకు అర్హత ఏమిటి?

ఏడి: ఈ కార్యక్రమం ద్వారా సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు కావాల్సిన డ్రిప్పు పరికరాలు వారి ఎంచుకున్న కంపెనీ రైతుకు ఉన్న అర్హతలు సంబంధించి నమోదు చేయాలని ఆన్లైన్లో చేసిన నమోదుకు సంబంధించి జిల్లా ఉద్యానవన అధికారి, జిల్లా కలెక్టర్ అనుమతి పొందిన తరువాత డ్రిప్ వేసుకోవాలని ఏ ప్రాంతంలో మొదట సర్వేచేసే సమయంలో వేసుకోవాలని భావిస్తారు. అదే పొలంలో వేసుకునే విధంగా చూడాలని దీనికి సంబంధించి ఐదు ఎకరాల లోపు ఉన్న చిన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీ 2.18లక్షల వరకు రాయితీ ఉంటుంది. ఐదు ఎకరాల నుంచి పది ఎకరాల వరకు ఉన్న రైతులుకు 70శాతం ఇందులో ఒక్కో రైతు గరిష్టంగా 3.46 లక్షల రాయితీ ఉంటుంది.

ప్రజాశక్తి: ఒక్కసారి డ్రిప్ పరికరాలు పొందిన వారు రెండోసారీ తీసుకొనే అవకాశముందా?

ఏడి: రైతు రెండోసారి పొందాలని భావిస్తే ఏడు సంవత్సరాల తర్వాత వారికి అనుమతి లభిస్తుంది. వెబ్‌లాండ్‌లో ఉన్న భూములకు సంబంధించి ఈ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చని రైతు భరోసా కేంద్రాలలో బయోమెట్రిక్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు సంబంధించి రైతుల వివరాలు ఆధార్ కార్డు, ఫోన్‌నెంబర్ శాశ్వతంగా ఉండేది ఇవ్వాలి.

ప్రజాశక్తి: పొలానికి డ్రిప్ పెట్టుకోవడం కష్టమా?

ఏడి: వెబ్ ల్యాండ్ పోర్టల్‌లో చేర్చిన పొలం విస్తీర్ణం ఆధారంగా అర్హత నిర్ణయించబడుతుంది. రైతు కట్టవలసిన నాన్ సబ్సిడీ మొత్తం ఏపీఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ పేరు మీదట పంపాలి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తర్వాత ఆ విధంగా పంపిన 15రోజులకు అనుమతి లభించడం జరుగుతుంది. మరో 15రోజులలో పూర్తిస్థాయిలో డ్రిప్ ఏర్పాటు చేసుకోవాలి. చివరి దశలు క్షేత్రస్థాయి సిబ్బంది మరోసారి రైతు డ్రిప్,స్ప్రింకర్లు వేసుకున్న విధానం పరిశీలించి ధ్రువీకరించాలి. రైతు భరోసా కేంద్రాల్లో పని చేసే సిబ్బంది ఇచ్చే నివేదిక మీదనే రైతుకు డ్రిప్ మంజూరు అవుతుంది.

ప్రజాశక్తి: రాష్ట్రీయ కృషివికాస్ పథకం ద్వారా రైతులకు అందే ప్రయోజనాలు ఏమిటి?

ఏడి: రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో టమోటా పంట అభివృద్ధి కోసం 2021-22లో అమల్లోకి తీసుకొచ్చారు. హైబ్రీడ్ టమోట విత్తనాల సరఫరా, నాణ్యమైన నారు పెంచడానికి షెడ్ నెట్ నర్సరీల ఏర్పాటు, టమోట ట్రెల్లీస్ సాగు, సమీకృత పోషణ, సస్యరక్షణ చర్యలు, చిన్న తరహా ప్రొసిసింగ్ యూనిట్స్ ఏర్పాటు, విక్రయకేంద్రాలు, రవాణా వాహనాలు ఏర్పాటు ఉద్యానవన పంటలు పండించే రైతులకు అందించడం జరుగుతుంది.

ప్రజాశక్తి: నీటిపారుదల జీవనోపాదుల అభివృద్ధి పథకం ముఖ్య ఉద్దేశం ఏమిటి?

ఏడి: ఈ పథకం క్రింద టమోటా, మామిడి పంట ప్రొసెసింగ్‌కు సంబింధించిన రైతు సంఘాలను అభివృద్ధి చేయడంతో పాటు మార్కెటింగ్, పంట కొత అనతరం రైతు సంఘాలకు కావలసిన మౌళిక సదుపాయాలు కల్పించడం ముఖ్య ఉద్దేశం.

అడ్డంకులు తొలగించండి

నీవా నదిలో సత్వర స్పందనకు అత్యవసర బృందాలు : నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వర్షాలు నేపథ్యంలో నగరంలో ముందస్తు వరద నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం కమిషనర్ నీవా నది పరివాహక ప్రాంతాల్లో పర్యటించి వర్షాల పరిస్థితులను సమీక్షించారు. వీరభద్ర కాలనీ, ధర్మరాజుల గుడి ప్రాంతాల్లో నీవా నదిని పరిశీలించిన కమిషనర్ ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులకు మార్గం నిర్దేశం చేపట్టారు. ప్రధానంగా నీవానదిలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా పూడిక మట్టి, కల్వర్టర్ల వద్ద వ్యర్థాలను జేసీబీలతో తొలగించే పనులను పరిశీలించారు. గహాల్లోకి నీరు ప్రవేశించకుండా కాలువలను శుభ్రం చేయించాలన్నారు. సంతపేటలిల్లీ వంతెన, ఇందిరానగర్, దోబీఘాట్ వద్ద నీటి ప్రవాహం పరిస్థితులను కమిషనర్ పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన పనులపై అధికారులకు సూచనలు చేశారు. మరో రెండురోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలపై నేపథ్యంలో ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం నుంచి అత్యవసర బందాలు అన్నిసమయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, క్లోరినేషన్ కచ్చితంగా చేయాలన్నారు. లీకేజీలను నివారించాలని ఆదేశించారు. వార్డు కార్యదర్శులు సచివాలయాల పరిధిలో అందుబాటులో ఉంటూ వర్షాల పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయి పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ ధనలక్ష్మీ, డీఈలు రమణ, వెంకటప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నయ్య, లోకనాథ్, ఏఈలు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.



నీవానది పరీవాహక ప్రాంతాలలో పర్యటిస్తున్న నగర కమిషనర్

నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్‌తో మంత్రి చర్చలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆదివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ ఎం.హరినారయణన్‌ను రాష్ట్ర పర్యాటక సాంస్కతిక వ్యవహారాల యువజన సర్వీసులశాఖ మరియు క్రీడాశాఖ మంత్రి ఆర్‌కె.రోజా క్యాంపు కార్యాలయంలో కలిశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలోని అభివద్ధి కార్యక్రమాల అమలుపై జిల్లా కలెక్టర్‌ను కలిసి నగరి నియోజకవర్గంలో కొత్తగా చేసిన ప్రతిపాదనలు, పెండింగ్‌లో ఉండి మంజూరు చేయవలసినవి, ప్రత్యామ్నాయంగా ప్రతిపాదించిన అభివద్ధి పనులను పూర్తిస్థాయిలో చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. పలు ప్రాంతాల్లో ఇంటిస్థలాలు ఇతర అభవద్ధి పనులు గురించి కలెక్టర్‌తో చర్చించినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజల నుంచి పలుఅభివద్ధి కార్యక్రమాల పై వచ్చిన వినతులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.



కలెక్టర్‌తో నియోజకవర్గ సమస్యలపై చర్చిస్తున్న మంత్రి రోజా

నేడు మొదలియార్ సంఘం సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మొదలియార్ సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం మురకంబట్టులోని ఎస్‌జిఎం కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఏపి మొదిలియార్ కార్పొరేషన్ ఛైర్మెన్ బుల్లెట్ సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మొదిలియార్ సంఘం అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలు, ఇతర విషయాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి మొదలియార్ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయంతం చేయాలని కోరారు.

104 సేవలు అంతంతమాత్రం..!

వైద్యంకోసం నిరీక్షిస్తున్న గ్రామీణ ప్రజలు

సమయపాలన పాటించని వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-యాదమరి : గ్రామీణ ప్రాంతాల్లో 104 వైద్యసేవలు అంతంతమాత్రంగా నిర్వహిస్తున్నారు. పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన 104 వాహనాలు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సక్రమంగా అందించడం లేదని.. అసౌకర్యంగా ఉన్న ప్రాంతాల్లో వాహనాలు ఏర్పాటు చేస్తున్నారని యాదమరి మండలంలోని పెరియంబాడి, కోనపల్లి గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు గ్రామ పంచాయతీల ప్రజలకు నెలకొకసారి 104 వాహనంలో వైద్య సౌకర్యం అందించాల్సి ఉండటంతో అందరికీ సౌకర్యవంతమైన ప్రాంతంలో సేవలు అందించాలని పెరియంబాడి, కోనపల్లి గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు. 30 కుటుంబాలు ఉన్న కమ్మారాయనిమిట్ట గ్రామంలో వైద్య సేవలు ఏర్పాటు చేయడంతో 200 కుటుంబాలు ఉన్న గ్రామాల పరిధిలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం లేదు. దీంతో ఆ గ్రామాల్లోని ప్రజలు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న శిబిరానికి వర్షంలో తడుచుకుంటూ వైద్యం కోసం వెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వైయస్సార్ హెల్త్ క్లినిక్ లను ఏర్పాటు చేస్తోంది. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కింద ప్రతి గ్రామ సచివాలయాల పరిధిలో హెల్త్ క్లినిక్ సేవలు అందిస్తున్నారు. సచివాలయ పరిధిలో ప్రజల వద్దకే నెలకోసారి 104 వాహనం వైద్య సిబ్బంది, వైద్యాధికారి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఆ సచివాలయ పరిధిలోని ఆరోగ్య సమస్యలపై వచ్చిన ప్రజలకు వైద్యం అందించి మందులు ఇవ్వాల్సి ఉంది. అయితే శనివారం కోనాపల్లి , పెరియంబాడీ, గ్రామపంచాయతీ పరిధిలో వైద్య సేవలు అందించాల్సిన వైద్యాధికారులు సమయపాలన పాటించకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మధ్యాహ్నం వరకు వాహనం వద్ద వివిధ సమస్యలతో వచ్చిన వారికి వైద్య పరీక్షలు అందించి మందులు అందించాల్సి ఉంది. అనంతరం వైద్య శిబిరం వద్దకు రాలేని బెడ్‌కు పరిమితమైన వారికి ఇంటి వద్దనే వైద్యాధికారులు, వైద్య సిబ్బంది వెళ్లి చికిత్సలు అందించాలి. సచివాలయ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సైతం పరిశీలించి అనారోగ్య బారిన పడిన పిల్లలకు వైద్య పరీక్షలు అందించాల్సి ఉంది. అయితే యాదమరి మండలంలో 104 వాహన సిబ్బంది, వైద్యాధికారులు కార్యక్రమంపై ప్రత్యేక దష్టి సారించడం లేదు. ప్రజల సౌకర్యార్థం చికిత్స అందించకుండా వారికి సౌకర్యంగా 104 వాహనాలను వారికి ఇష్టం వచ్చినచోట ఏర్పాటు చేసుకుంటూ, సమయపాలన పాటించకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావత్తం కాకుండా ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి గ్రామీణ ప్రజలకు అందరికీ అందుబాటులో ఉండే ప్రదేశాల్లో 104 వాహనాల ద్వారా వైద్య సదుపాయాలు కల్పించాలని గ్రామీణ ప్రాంతాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.



వైద్య సేవల కోసం వేచి ఉన్న వివిధ గ్రామాల ప్రజలు

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

నేటితరానికి గ్రంథాలయల ప్రాధాన్యత తెలియజేసేలా సోమవారం నుంచి జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రంథాయాల్లో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ మధుబాల, కార్యదర్శి శివప్రసాద్ తెలిపారు. ఈనేల 14 నుంచి 20వరకు నిర్వహించే వారోత్సవాల్లో గ్రంథాలయాల్లో తీసుకున్న పుస్తకాలను ఆలస్యంగా తిరిగీ ఇచ్చినా అపరాధ రుసుము చెల్లించకుండా తీసుకొనే అవకాశముంటుందని అలాగే వారోత్సవాల్లో పాఠకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయంతం చేయాలని ఛైర్‌పర్సన్ పిలుపునిచ్చారు. వారోత్సవాల్లో భాగంగా సోమవారం బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న వారికి సన్మానం, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వివిధ రకాల పోటీలు, 19న దిశ చట్టం, సాధికారితపై చర్చ, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన ముగింపు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.




గ్రంథాలయ ఛైర్‌పర్సన్ మధుబాల

పంచాయతీరాజ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ అసోషియేషన్ జిల్లా కార్యవర్గ ఏర్పాటు ఆదివారం స్థానిక రెవెన్యూభవన్‌లో నిర్వహించారు. అధ్యక్షులుగా ఈఈ పిఆర్ఐ పూతలపట్టు మహేష్ కుమార్, ఉపాధ్యాక్షులుగా ఏఈఈ గుడిపాల జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎఈఈ చిత్తూరు అంజు, కోశాధికారిగా ఏఈఈ విజయపురం వీరభద్రయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పూతలపట్టు ఏఈఈ ప్రసాద్ నాయుడులు ఏకగ్రీవంగా ఎన్నియ్యారు.



ప్రమాదకరంగా
రోడ్డుకిరువైపులా మొక్కలు



- రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు. సురేంద్రనగరం క్రాస్ నుంచి చిత్తూరు - పుత్తూరు జాతీయ రహదారి అమ్మపల్లి క్రాస్ వరకు ఉన్న బీటీ రోడ్డు ప్రమాదకరమైన మలుపులతో ఉంటోంది. దీనికితోడు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఉండటంతో మలుపుల్లో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి ప్రమాదాలను నివారించాలని డీఎం పురం గ్రామస్తులు కోరుతున్నారు.

శ్రీవేణుగోపాలస్వామిని దర్శించుకున్న సినీ డైరెక్టర్ శివ



సినీ డైరెక్టర్ ఆకుల శివను సన్మానిస్తున్న ఎంపీపీ దంపతులు

ప్రజాశక్తి - కార్వేటినగరం: కార్వేటినగరంలోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణు గోపాల స్వామి వారిని ఆదివారం సినీ డైరెక్టర్ ఆకుల శివ దర్శించు కున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం కార్వేటినగరం ఎంపీపీ దంపతులు లతాబాలాజీ సినీ డైరెక్టర్ ఆకుల శివను కలసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సినీ డైరెక్టర్ మాట్లాడుతూ పుట్టి పెరిగిన గ్రామం, సంస్థానాధీశుల కాలం నాటి చారిత్రక కట్టడాల్లో విద్యాభ్యాసం చేశానని.. ఈ చారిత్రక కట్టడాలను ఓ సినిమా తీసి రాచరిక కట్టడాలను ప్రపంచ వ్యాప్తంగా గుర్తించేలా చేస్తానన్నారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్‌బాబు ఆకుల శివను పూల మాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ గోపి, వైసీపీ నాయకులు ధనరాజ్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ ముందంజ



ప్రజాశక్తి-పుంగనూరు: పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు లైన్స్‌క్లబ్ ఎప్పుడూ ముందంజలో ఉంటుందని ప్రముఖ హోమియో వైద్యనిపుణులు లైన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ శివ అన్నారు. స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణంలో లయన్స్ క్లబ్ కుప్పం పీఈఎస్ మెడికల్ కాలేజ్ సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివ మాట్లాడుతూ ప్రతినెలా రెండో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని.. శిబిరంలో పేదలందరూ కంటి చికిత్సలు పొందుతున్నారని తెలిపారు. ఉచిత నేత్ర చికిత్స శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. 100 మందికి నేత్ర సంబంధ సమస్యలకు చికిత్సలు అందించారు. 25 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి పీఈఎస్ మెడికల్ కాలేజీ కుప్పంలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నారు. పీఈఎస్ మెడికల్ కాలేజీ వైద్య సిబ్బంది, లయన్స్ క్లబ్ ప్రతినిధులు ముత్యాలు, గోపాలకష్ణన్, వరదారెడ్డి, శ్రీరాములు, రఘునాథ్‌రెడ్డి, ఈశ్వరమ్మ, అమరావతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వరిపంట నేలమట్టం
రైతుకు రూ.2 లక్షలు నష్టం



ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: కురుస్తున్న వర్షాలకు వరిపంట నేలమట్టమై సుమారు రూ.2లక్షలు ఆస్తినష్టం జరిగింది. రైతుకు తెలిపిన వివరాలు.. గంగినాయన పల్లి రెవెన్యూ పరిధిలోని రైతులు టీ.మునెమ్మ, సుబ్రహ్మణ్యం సుమారు రెండున్నర ఎకరాలలో వరి పంట చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చేతి అందాల్సిన పంట నేలమట్టం కావడంతో రైతుకు సుమారు రెండున్నర లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందన్నారు. అధికారులు వెంటనే స్పందించి రైతుకు జరిగిన నష్టాన్ని పొలం వద్దకు వచ్చి పరిశీలించి ప్రభుత్వం వారు నష్టపరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లక్ష దీపార్చన విజయవంతం చేయండి
ఆలయ కార్యనిర్వహణాధికారి మునిరాజులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: లక్ష దీపార్చనను విజయవంతం చేయాలని వంశపార ధర్మకర్త విజయ్ కుమార్ ఆలయ కార్య నిర్వహణాధికారి మునిరాజులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసం పురస్కరించుకుని మండలంలోని మొగిలీశ్వర ఆలయంలో సోమవారం లక్షదీపార్చన చేపడుతున్నట్టు తెలిపారు. మండలంలోని జిల్లేడుపల్లి కొత్తూరుకు చెందిన సుమతి కోదండ రామస్వామి భజన బృందం శివకోటి కార్యక్రమం చేపడతారని ఈ కార్యక్రమాలను అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యా, ఉద్యోగ అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మహిళా అధ్యయన కేంద్ర రీడర్ డాక్టర్ డి.ఉమాదేవి అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నేషనల్ ఎడ్యుకేషన్ డే సందర్భంగా 'ఉమెన్ ఎంపవర్మెంట్ - ప్రొటెన్షియాలిటీస్, ప్రాక్టికాలిటీ అండ్ ప్రాపొండ్స్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభాలో సగం మంది మహిళలు ఉన్నా.. విద్య, ఉద్యోగ అవకాశాలను అందుకోవడంలో వెనుకబడి ఉన్నారన్నారు. మహిళా అధ్యయన విభాగ కేంద్రం ఇన్‌ఛార్జి హెడ్ డాక్టర్ పి.నీరజ మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 ఏ విధంగా మహిళాభివద్ధికి ఉపయో గపడుతుందో మాట్లాడుకోవడం ఎంతో అవసరమన్నారు. మహిళా అధ్యయన విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్.పి.మాధవి నేషనల్ ఎడ్యుకేషన్ డే-2022 థీమ్‌పై మాట్లాడారు. కార్యక్రమంలో ఫార్మర్ ఓఎస్‌డీ, ఎన్ఈపీ-2020 ఎం.ఓ.ఈ ప్రొఫెసర్ షకీలా శ్యామ్స్, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు డైరెక్షన్.. పవన్ యాక్షన్

పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్ బాబు



ప్రజాశక్తి-యాదమరి: చంద్రబాబు డైరెక్షన్‌లో పవన్‌కు రాజకీయ పబ్లిసిటీ పిచ్చి ముదిరిందని.. పేదల ఇళ్ల అభివద్ధి సినిమా సెట్టింగ్‌లా కలలు కంటున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్ బాబు ధ్వజమెత్తారు. తన కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా పేదలందరికీ ఇళ్లపథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారని తెలిపారు. ఉచితంగా స్థలాలు ఇవ్వడంతోపాటు ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేస్తున్నారని.. కులమత పార్టీలు చూడకుండా పేదలకు ఇళ్లు కట్టిస్తున్నారని.. ఊర్లను చూసి పవన్ కల్యాణ్ సినిమా సెట్టింగ్‌లు అనుకుంటున్నారన్నారు. చంద్రబాబుతో జతకట్టి ఆ డైరెక్షన్‌లో పవన్ కల్యాణ్ నటిస్తున్నారని.. రాజకీయ స్వార్థంతోను..ప్రజల్లో మెప్పు కోసం నటించడం, తప్పుడు కూతలు కూయడం తగదన్నారు. గాలి కబుర్లు కాకుండా పేదల ఇళ్ల అభివద్ధి ఎలా జరుగుతోందో నేరుగా చూడాలన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడాలంటూ జనసేన భజన నాయకులు నూరిపోయడం సమజంసం కాదని.. మునుపెన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో అభివద్ధి జరుగుతోందని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు వెంటనే చట్టబద్ధత కల్పించండి



ప్రజాశక్తి -పుంగనూరు: ఎస్సీ వర్గీకరణకు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చట్టబద్ధత కల్పించేందుకు సహకారం అవసరమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు నరేంద్రబాబు అన్నారు. పుంగనూరు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక అంబేద్కర్ భవన్లో మిద్దింటి పృథ్వీ కుమార్ మాదిగ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్రాలకు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జాతి కోసం ఒకవైపు శ్రమిస్తూనే సమాజం కోసం నిరంతరం కష్టపడుతూ అనేక సంక్షేమ పథకాలు సాధించి పెట్టారని గుర్తు చేశారు. చదువుకున్న యువత ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో భాగస్వామ్యమై గ్రామ స్థాయి నుండి నిరుద్యోగులను చైతన్యం చేసి వర్గీకరణకు కృషి చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా కో-కన్వీనర్ ఎం.ప్రకాష్ మాదిగ, పుంగనూరు నియోజకవర్గం ఇన్చార్జి బి.నర సింహులు మాదిగ, ఎంఎస్పి నాగరాజ, కో-కన్వీనర్ నాగభూషణం, వెంకట్రమణ, నాయకులు మాటూరి మురళి, మొగిలీశ్వర, చౌడేపల్లి మండల కన్వీనర్ బాజీగం హరిబాబు మాదిగ, కో- కన్వీనర్ గోవిందా మాదిగ, హరి మాదిగ, లక్ష్మయ్య మాదిగ, అమరనాధ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



డిప్యూటీ సీఎంకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుబాల

ప్రజాశక్తి-సోమల: ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి రామకష్ణ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. 14న వారోత్సవాల ప్రారంభం, 15న పుస్తక ప్రదర్శన, , పుస్తక పఠన ప్రాధాన్యత, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న వారిని స్మరించుట, 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు, 18న పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తత్వ, క్విజ్ తదితర పోటీలు, 19 న దిశా చట్టం మహిళా సాధికారత పై చర్చ , 20 న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, సామూహిక స్వీయ పఠనం, వారోత్సవాల ముగింపు ఉంటుందని తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాలకు డిప్యూటీ సీఎంకు ఆహ్వానం

కార్వేటినగరం: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నైనరు మధుబాల పుత్తూరులోని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి స్వగృహానికి చేరుకుని ఆదివారం గ్రంథాలయ వారోత్సవాల ఆహ్వాన పత్రికను అందించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం గ్రంథాలయ మునుగడ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి పంచాయతీలోనూ గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం జరుగుతోందని.. విద్యార్థుల అభివద్ధికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది శంకర్ బాబు, మునీంద్ర,సాయి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభించిన మంత్రి రోజా



ప్రజాశక్తి-నగరి: మండలంలోని తేరణి గ్రామంలో అక్షరాల రూ.35 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని మంత్రి ఆర్‌కే రోజా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయం సిబ్బంది అధికారులు, వైసీపీ కార్యకర్తలు, నాయకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నగరి మండల ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు వెంకట లక్ష్మీ, కన్నెప్పన్, ఎంపీటీసీ, ప్రదీప్, సర్పంచ్, నిర్మలా డింపుల్ బాబు, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్బీకే చైర్మన్ బుజ్జి రెడ్డి, నాయకులు, పలని, రవి, మోహన్ రాజ్, కాంట్రాక్టర్, షన్ముఘం, ఇతర ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

జ్ఞాపకాలు.. మధురం..!



గురువులతో పాటు పదో తరగతి పూర్వవిద్యార్థులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: వారంతా ఒకే పాఠశాలలో చదువుకున్నారు. పాఠశాలలో చదువు పూర్తి కాగానే ఎవరికి వారే ఉన్నత చదువుల కోసం వెళ్లిపోయారు. ఎవరు ఎక్కడ.. ఏ రంగంలో స్థిరపడ్డారో ఎవరికీ తెలియదు. ఎక్కడో ఒకరో ఇద్దరో అప్పుడప్పుడు కలుసుకుని మాట్లాడుకునేవారు. కొందరు సుదూర ప్రాంతాల్లో స్థిర పడటంతో కొంతవరకు పరిచయాలు లేనివారుగా మారిపోయారు. అందరికీ పెళ్లిళ్లు కావడంతో ఎవరి కుటుంబ పోషణకు వారు బిజీగా మారిపోయారు. ఎన్నాళ్లు అయింది నీతో మాట్లాడి మళ్లీ అందరితో కలుసుకుంటామని గాని, మాట్లాడుకుంటామని గాని ఊహించలేదని ఆనందాన్ని వ్యక్తం చేశారు. దీంతో రాచరిక కట్టడంలో ఒక్కటైన రాణీమహల్ మరోసారి గుర్తుకొచ్చి ఆదివారం పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమాన్ని తమకు విద్యాబోధనలు అందించిన అప్పటి ఉపాధ్యాయులతో కలసి ఆనందంగా జరుపుకున్నారు. అప్పటి కట్టడాలను తిరిగి తిరిగి చూసుకున్నారు. అనంతరం గురువులైన నాగశయనం, ఘటికాచలం, ఉమాశంకర్, డంఖా హమీద్ బాషా, సంపత్, పయణి, అలాగే పాఠశాలలో విధులు నిర్వహించిన నాన్ టీచింగ్ సిబ్బందిని కూడా పూలమాలలతో పాటు కాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులతో పాటు గురువులు గ్రూపు ఫొటో దిగారు.

ఎమ్మెల్సీ భరత్ జన్మదిన వేడుకలు



రామకుప్పంలో భరత్ జన్మదిన వేడుకల్లో అన్నదానం

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలో ఎమ్మెల్సీ భరత్ జన్మదిన వేడుకలను ఆదివారం మండల వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయనకు ఘన స్వాగతం పలికారు. భారీ కేక్ కోసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, గోపి, జడ్పీటీసీ కష్ణమూర్తి, మండల కో కన్వీనర్ రామ్మూర్తి, సర్పంచులు చంద్రాయన్, భాస్కర్, గోవిందప్ప, అమరరాజా, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ నాగభూషణం, నాయకులు రవి, కృష్ణ మూర్తి, వెంకటాచలం, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకుప్పం: చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కుప్పం నియోజకవర్గం వైకాపా ఇన్‌ఛార్జి కె ఆర్ జె భరత్ జన్మదిన వేడుకలను ఆదివారం రామకుప్పం మండల వైకాపా నేతలు అత్యంత ఘనంగా నిర్వహించారు. రామకుప్పం వైయస్సార్ సర్కిల్ వద్ద దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో కేక్ కట్ చేసి పూలమాలలతో దుశ్శాలువ్వలతో ఎమ్మెల్సీ ని సత్కరించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

డా॥బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీకి అడ్మిషన్లు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లకు ఈనెల 15 వరకు గడువు పొడిగించినట్లు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ నరసింహులు తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, డిప్లొమా, ఐటీ ఐ రెండు సంవత్సరాల కోర్సు పాసైన వారు, ఎన్ఐవోఎస్ పాసైనవారు డిగ్రీ లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ద్వితీయ, తతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించడానికి 15వ తేదీ ఆఖరని తెలిపారు. మరిన్ని వివరాలకు 9515401088, 9581628 409, 7382929641 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని కోరారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు

- ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రెడ్డప్ప ఎమ్మెల్యే


ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థ ఏర్పాటుచేసి వాలంటీర్లతో ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేశ గౌడ అన్నారు. ఆదివారం శంకర్రాయలపేట గ్రామంలో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు వాలంటీర్ల ద్వారా పారదర్శకంగా అందిస్తోందని.. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుతున్నాయని జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎన్.రెడ్డెప్ప, జడ్పీటీసీ సుష్మ కీర్తి, సింగిల్‌విండో అధ్యక్షులు శంకరప్ప, పలమనేరు మార్కెటింగ్ అధ్యక్షులు హేమంత్ కుమార్‌రెడ్డి, వైఫ్ ఎంపీపీలు జీడీ బాబు, అంజమ్మ, వైసీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైసీపీ మండల జిల్లా నాయకులు తమ్మిరెడ్డి, సుహెబ్, హరినాథ్, ఉప సర్పంచ్ కష్ణమూర్తి, శివాడి గ్రామపంచాయతీ సర్పంచ్, లలితమ్మ, ఉపసర్పంచ్ ఏఎంసీ డైరెక్టర్ సురేష్, ఎర్రబల్లి శ్రీనివాసులు, సర్పంచులు శిరీష నాగశంకర్‌రెడ్డి, తుర్లపల్లి సర్పంచ్ మురళీ, అమర్నాథ్ రెడ్డి, రాజారెడ్డి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమల పాదయాత్రలో గుండిగల్లు గ్రామస్తులు




తిరుమల పాదయాత్రలో గుండుగల్లు గ్రామస్తులు

ప్రజాశక్తి - గంగవరం: మండలంలోని గుండిగల్లు గ్రామస్తులు గత పది సంవత్సరాలుగా తిరుమల పాదయాత్రలో భాగంగా ఆదివారం గ్రామం నుండి 350 మంది భక్తులు తిరుమలకు కాలినడకన బయలుదేరి వెళ్లినట్లు గ్రామస్తులు తెలియజేశారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ ప్రతి ఏడు తిరుమలకు తమ గ్రామం నుండి అధిక సంఖ్యలో పాదయాత్రకి వెళుతూ ఉంటామని తెలిపారు.



ముస్లిం సోదరుల పెళ్లికి హాజరైన ఎంపీపీ

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని నజీర్ భాషా కుమారునికి వివాహం కర్ణాటక రాష్ట్రంలోని ముళబాగల్ గ్రామంలో పెళ్లి జరిగింది. వారి కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు మండల ఎంపీపీ మొగసాల రెడ్డప్ప, స్థానిక సర్పంచ్ కొమ్ము వెంకటేష్, వైస్ సర్పంచ్, మండలంలోని వైసీపీ కుటుంబ సభ్యులు ఆయనతో పాటు వెళ్లి పెళ్లికి కుమారుని ఆశీర్వదించి విందు భోజనం సేకరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో హాజరయ్యారు.



వైభవంగా గిరిజా కల్యాణం

ప్రజాశక్తి- రామకుప్పం: మండల కేంద్రంలో నెలకొని ఉన్న శ్రీ అన్నపూర్ణానాంబ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఆదివారం గిరిజా కల్యాణం ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. రాజుపేట నారాయణశెట్టి కుమారులు ఉభయ దారులుగా వ్యవహరించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా గిరిజా కల్యాణం నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి శాస్త్రి, హరినాథ్, ఆలయ ధర్మకర్త సజ్జల కోదండ రెడ్డి, రాజుపేట నారా యణశెట్టి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బయోకెమిస్ట్రీ కార్యశాల బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే కార్యశాల బ్రోచర్‌ను ఎస్వీయూ ఉప కులపతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యశాల "కరెంట్ ట్రెండ్స్ ఇన్ బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ " అనే అంశంపై నిర్వహిస్తున్నట్లు కార్యశాల కన్వీనర్ డాక్టర్ ఎం. బాలాజీ వెల్లడించారు. వీసీ ఆచార్య కె రాజారెడ్డి విద్యార్థులకు అవసరమైన వర్క్ షాపులు, కార్య శాలలు, సదస్సులు, ఓరియంటేషన్ శిక్షణ తరగతులు వంటివి నిర్వహించడం అధ్యా పకుల బాధ్యతగా గుర్తించాలని సూచించారు. ఆచార్య ఓవియస్ రెడ్డి, ఆచార్య డివియస్ మూర్తి, డా. బాలాజి పాల్గొన్నారు.

వడ్డి జగదీశ్‌కు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యా లయం హిందీ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి వడ్డి జగదీశ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎం.దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ విభాగపు అధ్యక్షులు డాక్టర్ నారాయణ మార్గదర్శకత్వంలో "సుశీల టాక్ భౌరే కే సాహిత్య మే దళిత నారీ సంఘర్ష" అనే అంశంపైన పరిశోధనా గ్రంథాన్ని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సమర్పించారు. వడ్డి జగదీశ్‌కు డాక్టరేట్ అవార్డు రావడం పట్ల హిందీ విభాగపు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

ఆగిఉన్న కారును ఢీకొన్న బొలేరో



- ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి - కార్వేటినగరం: ఆగిన కారును అదుపుతప్పి బొలేరో వాహనం ఢీకొన్న సంఘటన మండల పరిధిలోని పద్మసరస్సు సమీపంలోనే కుప్పానిగుంట వద్ద ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. చిత్తూరు వైపు నుంచి పుత్తూరుకు వెళుతున్న కారులోని ప్రయాణికులు కారును ఆపి కిందకు దిగారు. పుత్తూరు నుంచి కార్వేటినగరం వస్తున్న బొలేరో వాహనం ముందు టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి ఆగి ఉన్న కారును ఢీకొంది. ప్రమాదంలో రెండు వాహనాలు ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. అయితే కారులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బాధితులను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-వి.కోట: పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో గత మూడున్నరేళ్లుగా వేసవిలో నీరు సరఫరా చేసిన బాధితులకు ఇంతవరకు బిల్లులు ఇవ్వలేదని.. బకాయిలు రావాల్సిన బాధితులు ప్రభుత్వంపై ఒత్తిడికి సిద్ధమయ్యారు. వి.కోట నుంచి అమరావతికి ఆదివారం సాయంత్రం పయనమైన విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అమరావతికి వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. తమకు బిల్లులు చెల్లించకపోవడంతో తాము అప్పుల ఊబిలో కూరుకుపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వెళ్లడానికి వీల్లేదని వి.కోట సీఐ ప్రసాద్‌బాబు, ఎస్సై రాంభూపాల్ వి.కోట నుంచి బస్సులో బయల్దేరిన బాధితులను వెళ్లకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వానికి తమపై కనువిప్పు కలిగి తక్షణం బిల్లులు మంజూరు చేయాలని ప్రాధేయ పడుతున్నారు.



జెసిఐ కార్యవర్గ సమావేశంలో సన్మానం చేస్తున్న దృశ్యం

యువశక్తి నిర్మాణమే సామాజిక సౌభాగ్యం

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: యువశక్తి నిర్మాణం ద్వానే సామాజిక సౌభాగ్యం సాధ్యమని జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జెసిఐ) జాతీయ అడ్మినిస్ట్రేటివ్ కమిటీ సభ్యులు జిఎల్.మనోహర్ అన్నారు. ఆదివారం తిరుపతి వివాహ భోజనం హాల్‌లో జరిగిన జెసిఐ తిరుపతిశాఖ నిర్వహించిన 'గ్రేట్ డే' సదస్సులో కీలకోపన్యాసం చేశారు. ప్రపంచవ్యాప్తంగా యువకుల్లో వికాసం పెంపొందించడానికి బలమైన జెసిఐ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నది తెలిపారు. జెసిఐ ఫౌండేషన్ బోర్డు జాతీయ డైరెక్టర్ ఎన్‌బి.హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో సంతోషపు సూచీ పెంచడానికి అనువైన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. స్వీయ నిర్మాణం, ఎదుగుదల, సంతృప్తి, సమాజసేవ, లక్ష్య సాధన ద్వారానే సంతోషం స్వంతం అవుతుందన్నారు. బాలాజీ నర్సింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వై.ప్రవీణ్ మాట్లాడుతూ పారిశ్రామిక అభివద్ధి వైపు యువత అడుగులు వేయాలని కోరారు. జోష్ ప్రాపర్టీస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.ఈశ్వర్ ప్రకాష్ మాట్లాడుతూ కషి పట్టుదల ఉంటేనే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చని చెప్పారు. జేసీ నామా రాజేష్‌కుమార్‌కు కమలపాత్ర అవార్డు ప్రదానం చేశారు. అలాగే డాక్టర్ పైడి అంకయ్యకు ఔట్ స్టాండింగ్ యంగ్ పర్సన్ అవార్డు, కె.విశ్వనాథ్‌కు చైల్డ్ ప్రోడిగి అవార్డు, ఎం.గుణశేఖర్‌కు సిద్ధయ్య మెమోరియల్ అవార్డ్ అండగేసారు. సభకు తిరుపతిశాఖ అధ్యక్షులు పి.రాజారెడ్డి, అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి దొరస్వామిరాజు, కోశాధికారి రామమూర్తి, ప్రాజెక్టు చైర్మన్ ఎం.గుణశేఖర్, డైరెక్టర్ శేషసాయి ప్రసంగించారు.

ఘనంగా కార్తీక వన మహోత్సవం



కార్తీక్ వనభోజనం కార్యక్రమంలో దేవాంగ కుటుంబ సభ్యులకు వస్త్రాల పంపిణీ

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: తిరుపతి రూరల్, పుదిపట్ల గ్రామంలో లావణ్య లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం 'దేవాంగ'ల వనభోజన మహోత్సవం అటహాసంగా నిర్వహించారు. వన మహోత్స వానికి హాజరైన కుటుంబ సభ్యులందరికీ వారివారి ప్రాధాన్యతలను ఎంచుకొని ఆటలపోటీల్లో తమ ప్రతిభను చాటుకుని తగిన బహుమతులను అందుకున్నారు. ఉదయం 9గంటల అల్పాహారంతో వనమహోత్సవ కార్యక్రమం ప్రారంభమై పలురకాల ఆటలపోటీలతో సరదాగా సాగింది. మధ్యాహ్నం కార్తీక వనమహోత్సవ భోజనాలను నిర్వహించారు. వనభోజనాల విరామం తర్వాత 'దేవాంగ' కుటుంబీకుల వివాహ పరిచయ వేదికను నిర్వహించారు. అలాగే పదవ తరగతి, ఇంటర్లలో అత్యధిక మార్కులు సంపాదించుకున్న విద్యార్థులకు, ఉద్యోగరీత్యా పదవీ విరమణ పొందిన వారికి సన్మానాలు చేశారు. తేనేటి పానీయంతో కార్యక్రమానికి ముగింపు పలుకి దేవాంగ కుటుంబ సభ్యు లందరికీ పూర్తి ఆనందోత్సవాల్ని నింపారు. అధ్యక్షులు గోదెన విశ్వ నాథం, కార్యదర్శి కర్నా చంద్రశేఖర్ సంఘం తరపున ప్రశంచించారు.